క్లుప్తంగా

గోకివాడలో లోవాంబిక అమ్మవారి జాతర నేడు


గోకివాడ గ్రామంలో లోవాంబిక అమ్మవారు

రాంబిల్లి : గోకివాడ గ్రామంలో లోవాంబిక అమ్మవారి జాతర మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండేళ్లకోసారి ఈ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహిస్తుంటారు. గత నెలలో అమ్మవారి పుట్టుక మహోత్సవాన్ని నిర్వహించారు. అనుపు మహోత్సవం సందర్భంగా ఈ గ్రామంలో జాతరను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భారీ స్థాయిలో భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. సీఐ దీనబంధు పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించనున్నారు. జాతరను పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మునగపాకలో హెల్పింగ్ హ్యాండ్స్ ప్రారంభం

మునగపాక : మునగపాకలో ఆదివారం రాత్రి హెల్పింగ్ హ్యాండ్స్ లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కూటమి నేతలు టెక్కలి పరశురామ్,దాడి ముసిలినాయుడు తదితరులు లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైనా వాటి పరిష్కారానికి హెల్పింగ్ హ్యాండ్స్ దోహదపడుతుందన్నారు. ఆపదలో ఉన్న వారికి తమవంతు సాయం అందించేలా పాటుపడాలన్నారు. విద్యావేత్త కోరుకొండ గోపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెంటకోట విజయ్, ఆడారి శ్రీకాంత్, శరగడం జగన్, విల్లూరి నూక నరసింగరావు, ఎ.వి. సత్యనారాయణ, డొక్కా నాగభూషణం, కె.పి.రావు , దాడి శివ పాల్గొన్నారు.

ఘనంగా వల్లభనారాయణ స్వామి కల్యాణం


శ్రీదేవి భూదేవి సమేత వల్లభనారాయణస్వామి కల్యాణం

రాంబిల్లి: దిమిలి గ్రామంలో వల్లభనారాయణ స్వామి ఆలయంలో సోమవారం శ్రీదేవి భూదేవి సమేత వల్లభనారాయణస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నేతేటి రామచంద్రాచార్యులు , నేతేటి గోపాలకృష్ణల ఆధ్వర్యంలో ఈ కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కనులపండువలా సాగిన కల్యాణ మహోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేసారు.

మామిడిలో అంతర పంటగా నువ్వుల సాగు


కె.కె.అగ్రహారంలో అంతర పంటగా సాగులో నువ్వు పంట

కె.కోటపాడు: మండలంలో మామిడి పంటలను సాగుచేస్తున్న మెట్ట ప్రాంత గ్రామాల్లో రైతులు అంతర పంటల విధానంలో పంటలను సాగు చేస్తున్నారు. ప్రధానంగా మొక్క దశలో ఉన్న మామిడి తోటల మధ్య గల ఖాళీల్లో ఈ అంతర పంటలు వేస్తున్నారు. కె.కె.అగ్రహారం, పాతవలస, మర్రివలస తదితర గ్రామాల్లో మామిడిలో తోటలో అంతర పంటగా నువ్వులు సాగు చేస్తున్నారు. దీని ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని సాగు రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న నువ్వు పంట కోత దశకు చేరుకుంది.

భక్తిశ్రద్ధలతో బక్రీద్


బక్రీద్ వేడుకల్లో ముస్లింలు

కోటవురట్ల : మండలంలో బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక ముస్లిం కాలనీలో మజీద్ ఉస్మాన్ ఘనీ కమిటీ, నవజవాన్ యూత్ ఆధ్వర్యంలో బక్రీద్ జరుపుకొన్నారు. గౌస్ పాక్ నిషాని నుంచి తక్‌బీర్ చదువుకుంటూ మసీదు ఉస్మాన్ ఘనీ సమీపంలో ఉన్న ఈద్‌గాహ్‌కు చేరుకున్నారు. హాఫీజ్ అబ్మత్ రజ నేతృత్వంలో నమాజ్ చేశారు. నమాజ్ అనంతరం ఖద్బను చదివారు. సహనం, త్యాగాలను ప్రతీకగా బక్రీద్‌ను పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ హజరత్ ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకోవాలన్నారు. పరస్పర ఆలింగనం చేసుకుంటూ ఈద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

నక్కపల్లి : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. మండలంలో పెద బొదిగల్లం, అప్పలపాయకరావుపేట, చినబోదిగల్లం, రామకృష్ణాపురం, పెద దొడ్డిగల్లు గ్రామాల్లో దర్గాల వద్ద ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఐక్యతకు ప్రతీకగా బక్రీద్

యలమంచిలి : త్యాగలకు, ఐక్యతకు ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తోంది. యలమంచిలి రెహమత్ యూత్ ఆధ్వర్యంలో జామియా మసీద్‌లో బక్రీద్ వేడుకలు ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా ప్రతి ఒక్కరూ ఆలింగనం చేసుకొని శుభాలు కలగాలని కోరుకున్నారు. యలమంచిలి మండలం రేగుపాలెం మసీద్‌లో స్థానిక ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యలమంచిలి పట్టణంలో మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు అందరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మగబుల్,అబ్దుల్లా మాస్టారు,సయ్యిద్ బషీర్,ఎస్కే అజ్మీర్ వలీ,షేక్ బుఖారి,సయ్యిద్ కౌశిక్ పాల్గొన్నారు.


యలమంచిలిలో బక్రీద్ వేడుకల్లో ముస్లింలు


మునగపాకలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలో ముస్లింలు ఉదయం నుంచి గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు సంప్రదాయ బద్ధంగా ఒకరికొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మునగపాక బైపాస్ రోడ్డును ఆనుకొని ఉన్న అల్ నూర్ మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

యలమంచిలి రూరల్ : త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకలను యలమంచిలి పట్టణం, మండలంలో రేగుపాలెం గ్రామంలో సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని ఉదయాన్నే ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ ప్రాముఖ్యతను మత పెద్దలు వివరించారు. త్యాగ నిరతిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.కొందరు ముస్లింలు ఖబ్రస్తాన్ వద్ద పూర్వీకుల సమాధులపై పుష్పాలు చల్లి నివాళి అర్పించారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు


రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న సభ్యులు


శ్రీ రామహోమం నిర్వహిస్తున్న నిర్వాహకులు, సభ్యులు

పాయకరావుపేట : మండలంలో గల సత్యవరం గ్రామం దళితవాడలో నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఆలయం అయిదవ వార్షికోత్సవం సందర్భంగా పూజలు, పంచామృత అభిషేకం, సహస్ర శ్రీరామ హోమం నిర్వహించినట్లు సేవా ఫౌండేషన్ ప్రతినిధులు నీలాపు వెంకటరెడ్డి తెలిపారు. పూజ కార్యక్రమాలు అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు తాడి సూరిమూర్తి, కార్యక్రమం నిర్వాహకులు, ఆలయ ధర్మకర్త పిల్ల అచ్చుతరావు, సహాయకులు కూలీ నానాజీ, ఫౌండేషన్ ప్రతినిధులు మేడిశెట్టి దివాణం , చేపల అప్పలరాజు, కట్టా వీరబాబు, పోతు రంగారావు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో కాలువల అభివృద్ధి


వాడ్రాపల్లి కాలువలో పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక: ఉపాధిహామీ పథకం ద్వారా కాలువలు,చెరువులు అభివృద్ధి చెందుతున్నాయని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా వాడ్రాపల్లి ప్రాంతంలోని సాగునీటి కాలువలు అలాగే చెరువుల్లో పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి తుప్పలతో పేరుకుపోయిన కాలువలను ఉపాధిహామీ పథకం కూలీల ద్వారా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ఊరిస్తున్న వర్షాలు...మండే ఎండలు


వేంపాడు టోల్‌గేట్ వద్ద విక్రయిస్తున్న కొబ్బరి బొండాలు


నక్కపల్లిలో జ్యూస్ షాపు వద్ద వివిధ రకాల పండ్లను అందుబాటులో ఉంచిన దృశ్యం

నక్కపల్లి : ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ వర్షాలు లేక వాతావరణంలో మాత్రం మార్పు కనిపించడం లేదు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు చాలా తీవ్రంగా ఉంటున్నాయి. ఉపాధి పనులకు వెళ్లే వారు తొమ్మిది గంటలకే ఇంటి ముఖం పడుతున్నారు. జాతీయరహదారిపై రాకపోకలు సాగించేవారు ఎండధాటికి తట్టుకోలేక తలకు గుడ్డలు చుట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దుకాణాలను మధ్యాహ్నం 12 గంటలకల్లా మూసి సాయంత్రం ఐదుదాటితే తప్ప తెరవడం లేదు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు జాతీయరహదారిపై సేదతీరేందుకు ఎటువంటి సదుపాయాలు లేక ఇక్కట్లు పడుతున్నారు. టోల్‌గేట్ పరిసర ప్రాంతాలతో పాటు, పాయకరావుపేట నుంచి అనకాపల్లి వరకు జాతీయ రహదారికి ఇరువైపులా కొబ్బరి బొండాల విక్రయాలు జోరందుకున్నాయి. గిరాకీ పెరగడంతో బొండా రూ.30ల చొప్పున విక్రయించారు. బొప్పాయి, పైనాపిల్ పండ్లను ముక్కలుగా కోసి కవర్లలో పెట్టి విక్రయిస్తున్నారు. హైవేకు ఇరువైపులా టీ టైమ్‌ల వద్ద జ్యూస్‌లు, బాదం మిల్క్, ఫ్రూట్ సలాడ్, మిల్క్‌షేక్ విక్రయాలు సైతం బాగా పెరిగాయి. జ్యూస్‌లు గ్లాస్ రూ.30 చొప్పున, మిల్క్‌షేక్‌లు రూ.70 నుంచి రూ.90 వరకూ ధరల్లో విక్రయిస్తుండడంతో ప్రయాణికులు వాటితోనే దాహార్తి తీర్చుకుంటున్నారు.

మురుగు కాల్వల ఆక్రమణలు తొలగిస్తాం


డ్రైనేజీ కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మున్సిపల్ అధికారులు

యలమంచిలి : పట్టణంలో మురుగునీటి సమస్య నిర్మూలనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలో మురుగునీటి కాలువలను అధికారులు, నాయకులతో కలసి సోమవారం పరిశీలించారు. యానాద్రి కాలువను పరిశీలించి కాలువను వెడల్పు చేయడానికి పూడికతీత, ఆక్రమణలను తొలగించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తులసీనగర్, ఎన్టీఆర్ కాలనీ తదితర వీధుల్లో కాలువలను వాటిలో పూడికపోయిన చెత్తను తొలగించాలన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రభాకరరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, పట్టణ జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

రాంబిల్లి: రాంబిల్లి ఉన్నత పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సందర్శించనున్నట్లు ఎంఈవో ఎం. సూర్యారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పాఠశాలను తనిఖీ చేయడంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడతారని ఎంఈవో పేర్కొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి


పెదకలవలాపల్లిలో ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

రాంబిల్లి : నేవీ ప్రహరీ నిర్మాణంతో నష్టపోతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని పెదకలవలాపల్లిలో మహిళా రైతులు, కూలీలు డిమాండ్ చేసారు. ఈ గ్రామంలో మహిళ రైతులు, కూలీలు సోమవారం ధర్నా కొనసాగించారు. అటవీ భూములు చుట్టూ నేవీ నిర్మిస్తున్న ప్రహరీ గోడ కారణంగా తాము ఉపాధి కోల్పోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

సరుగుడు వైపు.. రైతుల చూపు


కె.సంతపాలెం నర్సరీలో క్లోన్స్ రకం సరుగుడు మొక్కలు


నాట్లు వేసేందుకు ఆటోలలో తరలిస్తున్న మొక్కలు

కె.కోటపాడు: ప్రస్తుతం వర్షాలు అడపాదడపా కురుస్తుండడంతో వరి, చెరకు పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు సరుగుడు సాగుకు ఆసక్తిని చూపుతున్నారు. సరుగుడుకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. టన్ను సరుగుడుకు రూ.10 వేల వరకూ మద్దతు ధర దక్కుతోంది. వరి, చెరకు పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోవడం, మద్దతు ధర ఆశించినంత లేకపోవడంతో సరుగుడు సాగు వైపు రైతులు మళ్లుతున్నారు.

వెయ్యి ఎకరాల్లో సరుగుడు నాట్లు

ఈ ఏడాది కె.కోటపాడు మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో ఖరీఫ్ సాగు కాలం ప్రారంభానికి ముందే వెయ్యి ఎకరాల్లో సరుగుడు సాగుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. సరుగుడు సాగుకు వాతావరణ పరిస్థితులు ప్రస్తుతం అనుకూలంగా ఉన్నాయి. దీంతో సరుగుడు నారు సేకరణ పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. చౌడువాడ, గొండుపాలెం, గుల్లేపల్లి, అర్లి, చంద్రయ్యపేట, చింతపాలెం, పిండ్రంగి, శృంగవరం, కొత్త భూమి, గొట్లాం గ్రామాల్లో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో సరుగుడు మొక్కలు వేశారు. ఎకరా పొలంలో సరుగుడు నాట్లు, దుక్కులు, ఎరువులు ఇతర కూలీ ఖర్చులతో సుమారు రూ.30 వేలు పెట్టుబడి వ్యయం అవుతుంది. నాలుగేళ్లలో రూ.8 నుంచి 10 లక్షల వరకు లాభార్జన చేయవచ్చని రైతులు చెప్తున్నారు.

ఎకరానికి 80 టన్నుల దిగుబడి

సరుగుడు సాగులో క్లోన్స్ సీహెచ్-5, మర్కాన్ రకంతో పాటు జుంజూర్ రకం సరుగుడు నారు అందుబాటులో ఉంది. నాటు సరుగుడు రకం మొక్కలు కోత దశకు ఎదగాలంటే సుమారు ఐదేళ్లు పడుతుంది. ఈ రకం మొక్కలతో ఎకరానికి 50 టన్నుల దిగుబడి మాత్రమే వస్తుంది. క్లోన్స్, జుంజూర్ రకం సరుగుడు వల్ల ఎకరా విస్తీర్ణంలో 80 టన్నులకు పైగా దిగుబడి సాధ్యం. మరోవైపు నాలుగేళ్లలోనే కోత దశకు వస్తుంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదైనా ఈ రకం సరుగుడు తట్టుకుని ఏపుగా ఎదుగుతుంది. దీంతో లాభదాయకంగా మారిన సరుగుడు సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు.

సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగ నేడు


ప్రత్యేక అలంకరణలో గ్రామ దేవత సన్యాసమ్మ తల్లి

దేవరాపల్లి: స్థానికగ్రామ దేవత శ్రీ సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అమ్మవారి పండగను పురస్కరించుకుని గ్రామస్తులు తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకుని, అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొలుత జూన్ 4న అమ్మవారి ఒడ్డు పండగ జరగాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ అమలుతో పాటు అదే రోజు ఓట్ల లెక్కింపు జరుగనుండటంతో పోలీసుల సూచన మేరకు పండగను వాయిదా వేశారు. దీంతో తాజాగా మంగళవారం అమ్మవారి పండగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

టీవీ రమణను పరామర్శించిన ధర్మశ్రీ


వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు టీవీ రమణని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

రోలుగుంట: మండలంలోని జానకిరాంపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ టీవీ రమణని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సోమవారం పరామర్శించారు. రమణ గుండె సంబంధిత వ్యాధికి చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన ధర్మశ్రీ అతని ఇంటికి వెళ్లి, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఏ సాయం కావాలన్నా తనకు ఫోన్ చేయాల్సిందిగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రమణను పరామర్శించిన వారిలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు మద్దు అప్పలనాయుడు, లగుడు కృష్ణంనాయుడు ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో చురుగ్గా ఉపాధి పనులు


పోడు భూముల్లో ట్రెంచ్, రాతి పేర్పు పనుల్లో ఉపాధి కూలీలు

నాతవరం: గిరిజన గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా వ్యవసాయ భూముల్లో ట్రెంచ్‌లు, రాతిపేర్పు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండలంలోని సరుగుడు, సుందరకోట పంచాయతీల శివారు 16 గిరిజన గ్రామాల్లో జీడిమామిడి తోటలున్న పోడు భూముల్లో పనులు చేపట్టాలని చాలా కాలంగా గిరిజనులు అధికారులను కోరుతున్నారు. వారి కోరిక మేరకు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ప్రత్యేక దృష్టి సారించి ఉపాధి హామీ పథకం అధికారులతో మాట్లాడి రాతిపేర్పు, ట్రెంచ్ పనులు చేపట్టారు. ఇటీవల వర్షాలు కురియడంతో చెరువులో నీరు చేరి ఉపాధి హామీ పనులకు ఆటంకంగా మారింది. దీంతో కూలీలకు 100 రోజుల పాటు పని కల్పించే కార్యక్రమంలో భాగంగా పోడు భూముల్లో పనులు చేపట్టారు. సరుగుడు, సుందరకోట గ్రామాల్లో నిబంధనల మేరకు పనులు చేస్తున్నారు. జిల్లాలోనే అధికంగా కూలీలకు పని కల్పించాలన్న ఉన్నతాధికారులు ఆదేశాలతో ఎంపీడీవో జాగరపు రాంబాబు, ఏపీవో చిన్నారావు ప్రత్యేక దృష్టి సారించారు. రెండు వారాల క్రితం మండలంలో రోజుకు 12 వేలకు పైగా కూలీలకు పని కల్పించేవారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువుల్లో నీరు చేరడంతో ఉపాధి పనులు నెమ్మదించినట్లు అధికారులు చెప్తున్నారు.

తాండవ రైతు ఉత్పత్తిదారుల సంఘం సమావేశం


సంఘం సమావేశానికి హాజరైన రైతులు

పాయకరావుపేట : తాండవ వ్యాలీ ఉద్యాన వన, వ్యవసాయ రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహాయ సహకార సంఘం సమావేశం మండలంలో గల సత్యవరం గ్రామంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు విశ్వనాధుని వెంకట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం ఆధ్వర్యంలో రైతులకు క్రిమి సంహారక మందుల వ్యాపారం ప్రారంభించడం, హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా కలెక్షన్ సెంటర్లు, ప్యాకింగ్ నిర్మాణం , మహిళల జీవనోపాధి పెంపకంలో భాగంగా వివిధ రంగాల్లో మహిళలకు శిక్షణ ఇచ్చి నైపుణ్యలను పెంచడం తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి జి.వి.వి. సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

'అందరి సహకారంతో హిందూ ధర్మ పరిరక్షణ'

మాడుగుల రూరల్: హిందూ మత వ్యాప్తికి ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీమన్నారాయణాచార్యులు తెలిపారు. సోమవారం కె.జె.పురం జంక్షన్లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన భక్తులును ఉద్దేశించి మాట్లాడారు. అన్యమత వ్యాప్తిని అరికట్టడానికి గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఎన్నెన్నో వర్ణాలు.. అన్నింట్లో అందాలు


అందమైన రాఖీ పుష్పం


కనువిందు చేస్తున్న గోవా ఫ్లవర్స్


పువ్వు కాదు ఇవి ఆకులే

అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రోడ్ల పక్కన మొక్కలు రంగు రంగుల పుష్పాలతో కనువిందు చేస్తున్నాయి. కొన్ని రకాల పువ్వులకు పేర్లు తెలియకపోయినా వాటి అందం కళ్లను కట్టిపడేస్తోంది. చోడవరం పట్టణం, శివార్లలో కొన్ని మొక్కలకు పూసిన పువ్వులు చూపరుల్ని ఆకట్టుకుంటున్నాయి. రాఖీ మాదిరిగా రంగురంగులతో ఓ పుష్పం అందాలు చిందిస్తుంటే.. మరో మొక్క ఆకులే పువ్వులుగా కనిపించి అందరి దృష్టిని తన వేపు తిప్పుకుంటోంది. ఆకు మధ్యలో పువ్వు లేకపోయినా, ఎర్రటి పువ్వు మాదిరిగా సగం ఆకులు రంగును పూసుకోవడంతో ఆకు మధ్యలో పువ్వు విచ్చుకున్నట్లే కనిపిస్తోంది. క్రోటాన్ జాతికి చెందిన గోవా ఫ్లవర్ చూసేవారిని కట్టి పడేస్తోంది. తొలకరి సీజన్లో వర్షాలు కురవడంతో సాధారణ రకాలతో పాటు సువాసన లేని ఇలాంటి పువ్వులు పూస్తాయని స్థానికులు చెప్తున్నారు. వీటిని చూసేందుకు అటుగా వెళ్లే జనం ఆసక్తి చూపుతున్నారు.

– చోడవరం